# సేవా దృక్పథంతో పనిచేయాలి

- ఉత్తమ సేవలందించిన అధికారులకే గుర్తింపు ● కలెక్టర్, అదనపు కలెక్టర్ల పనితీరు ప్రశంసనీయం
- ఆత్మీయ వీడ్కోలు సమ్మేళనంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ● జడ్పీ చైర్మన్ పుట్ట, ఎమ్మెల్యే దాసరితో కలిసి బదిలీపై వెళ్తున్న ఉన్నతాధికారులకు సన్మానం ● నూతన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు స్వాగతం



పెద్దపల్లి పూర్వ కలెక్టర్ డాక్టర్ సర్వే సంగీత సత్యనారాయణను సన్మానిస్తున్న మంత్రి ఈశ్వర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, ఎమ్మెల్యే దాసరి



పెద్దపల్లి జిల్లా నూతన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను సన్మానించి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న మంత్రి ఈశ్వర్, చిత్రంలో జడ్పీచైర్మన్ పుట్ట మధూకర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి, జూలై 19: ఉత్తమ సేవలందించిన అధికారులకే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు సేవా దృక్పథంతో చేయాలని, అధికారులు, సిబ్బంది సైతం ప్రజలకు మేలు చేసే దిశగా అందుబాటులో ఉన్న చట్టాలను వినియోగించాలని సూచించారు. బుధవారం పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్‌లో బదిలీపై వెళ్తున్న కలెక్టర్ డాక్టర్ సర్వే సంగీతా సత్యనారాయణ, అదనపు కలెక్టర్లు వీ లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్‌కు ఆత్మీయ వీడ్కోలు సమ్మేళనం నిర్వహించారు. జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ హాజరు కాగా, మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లకు పూలబొకేలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కొత్త కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పుష్ప గుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కలెక్టర్, అదనపు కలెక్టర్లు జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశారని ప్రశంసించారు. ధాన్యం కొనుగోలు, అర్హులకు పథకాల ఫలాలందించడంలో ముఖ్య భూమిక పోషించారన్నారు. చిత్తశుద్ధితో పనిచేసిన ఉన్నతాధికారులు ఒకేసారి బదిలీ కావడం కాస్తా బాధాకరమన్నారు. మున్ముందు ఇదే స్ఫూర్తితో పనిచేసి ప్రజల మన్ననలు అందుకోవాలని ఆకాంక్షించారు. కొత్త కలెక్టర్ సైతం సమర్థవంతంగా పనిచేస్తారని ఆశిస్తున్నామని, ఆయనకు అధికారులు, ప్రజాప్రతినిధులు సంపూర్ణంగా సహకరిస్తారని చెప్పారు. అనంతరం అదనపు కలెక్టర్ వీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో పెద్దమనసు కలిగిన ప్రజలు ఉన్నారని చెప్పారు. మనకు సమస్య ఉన్నప్పుడు అధికారి ఏ విధంగా స్పందించాలని కోరుకుంటామో.. దరఖాస్తుదారుడు మన దగ్గరికి వచ్చినప్పుడు అధికారిగా మనం కూడా స్పందించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నిస్వార్థంగా సేవలందిచిన వారిని పేద ప్రజలు గుండెలో పెట్టుకుంటారన్నారు. అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలోని పల్లెల అభివృద్ధికి కృషి చేశానని చెప్పారు. ఇక్కడ పనిచేయడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు.

### చిత్తశుద్ధితో అద్భుత ఫలితాలు

కలెక్టర్, అదనపు కలెక్టర్లు చిత్తశుద్ధి ఫలితంగా పెద్దపల్లి జిల్లా అన్ని రంగాల్లో అద్భుత ప్రగతి సాధించింది. ముఖ్యంగా కలెక్టర్ సంగీత సత్యనారాయణ అంకిత భావంతో విధులు నిర్వర్తించారు. మంథని సింగరేణి ప్రభావిత గ్రామాల్లో 15 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ చాకచక్యంగా పరిష్కరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విశేష కృషి చేశారు.

**- పుట్ట మధూకర్, జడ్పీ చైర్మన్**

### అర్హులకు అభివృద్ధి ఫలాలు

కలెక్టర్, అదనపు కలెక్టర్లు రెండున్నరేళ్లుగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందేలా విశేష కృషి చేశారు. పేదలకు ఇండ్ల స్థలాల పంపిణీని కలెక్టర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ విజయవంతం చేశారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ పకడ్బందీగా నిర్వహించారు.

**- దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే**

### ఇక్కడ పనిచేయడం సంతృప్తినిచ్చింది




పెద్దపల్లి జిల్లాలో విధులు నిర్వహించడం సంతృప్తి ఇచ్చింది. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, వ్యవసాయశాఖలో ఆయిల్‌పామ్ సాగు, రైతుబంధు, రైతుబీమా అమలు, రైతు వేదికల నిర్మాణం, వరదల సమయంలో లోతట్టు ప్రాంతాల వారిని తరలింపు లాంటి అనేక కార్యక్రమాలను విజయవంతంగా చేశాం. ఈ జిల్లాలో అద్భుతమైన అధికార బృందం ఉన్నది. పెద్దపల్లి జిల్లా నాకు ఎప్పుడు ప్రత్యేకంగా నిలుస్తుంది. సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు నా కృతజ్ఞతలు.

**- డాక్టర్ సర్వే సంగీత సత్యనారాయణ, బదిలీ వెళ్తున్న కలెక్టర్**

# ఉత్తమ సేవకు దక్కిన గౌరవం

- ఎల్లారెడ్డిపేట సర్పంచ్ వెంకట్‌రెడ్డికి భారత్ అన్మోల్ అవార్డు ● మంత్రి కేటీఆర్ అభినందన

ఎల్లారెడ్డిపేట, జూలై 19: ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. 18 ఏండ్లుగా ఆయన చేస్తున్న సామాజిక సేవలకు జాతీయ ఖ్యాతి లభించింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెక్టార్ న్యూ ఢిల్లీ వారు 'భారత్ అన్మోల్' అవార్డుకు ఎంపిక చేశారు. ఆయన ప్రజాప్రతినిధిగా సేవలందిస్తూనే చాలామంది నిరుపేదల వివాహాలకు పుస్తెమట్టెల పంపిణీ, అన్నదానం లాంటి కార్యక్రమాలు చేపట్టారు. ఆయన ఈ పురస్కారాన్ని ఢిల్లీలోని అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఈ నెల 31న అందుకోనున్నారు. కాగా, అవార్డుకు ఎంపికైన నేవూరి వెంకట్‌రెడ్డి బుధవారం మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా అమాత్యుడు ఆయనను అభినందించారు. అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉన్నదని వెంకట్‌రెడ్డి చెప్పారు. కాగా, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు వెంకటర్‌రెడ్డిని అభినందించారు.



హైదరాబాద్‌లో సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డిని అభినందిస్తున్న మంత్రి కేటీఆర్

# పేద విద్యార్థినులకు సైకిళ్లు

- ఎల్‌ఎం కొప్పుల ట్రస్ట్ ద్వారా 20 మందికి అందజేత



జగదేవ్‌పేటకు చెందిన 20 మంది విద్యార్థినులకు ఎల్ ఎం కొప్పుల ట్రస్ట్ ఆధ్వర్యంలో సైకిళ్లను అందజేస్తున్న చైర్మన్ కొప్పుల స్నేహలత

వెల్గటూర్, జూలై 19 : వెల్గటూర్ మండలంలోని జగదేవ్‌పేట గ్రామానికి చెందిన 20 మంది పేద విద్యార్థినులు వెల్గటూర్, కొండాపూర్, కుమ్మరిపల్లి ఆదర్శ పాఠశాలల్లో 8, 9, 10 తరగతి చదువుతున్నారు. అయితే ఈ మూడు స్కూళ్లు నాలుగు కిలోమీటర్లలోపే ఉండగా, విద్యార్థులంతా ఆటోలకు వెళ్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు మంత్రి కొప్పుల ఈశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఎల్‌ఎం కొప్పుల సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా సైకిళ్లను అందజేశారు. బుధవారం ట్రస్ట్ చైర్మన్ కొప్పుల స్నేహలత చేతులమీదుగా గ్రామ పంచాయతీ ఎదుట విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో బత్తుల భూమయ్య, హెచ్‌ఎం జీవన్, సర్పంచ్ గాగిరెడ్డి లింగమ్మ-రాజేశ్వర్ రెడ్డి, ఏఎంసీ చైర్మర్ పత్తిపాక వెంకటేశ్, ఉప సర్పంచ్ తిరుపతి రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు లక్కాకుల వేణు, ఆర్బీఎస్ మండల అధ్యక్షుడ గడ్డం లచ్చిరెడ్డి, నాయకులు కునమల్ల లింగయ్య, వేయగండ్ల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేను సల్లగుండాలే బిడ్డ అని దీవిస్తున్న చెంది బుచ్చవ్వ

## సల్లంగుండు బిడ్డ..

'బిడ్డా.. మంచిగున్నవా..? కేసీఆర్ సారు మంచి పనులు చేత్తండు. మా ముసలోళ్లను కడుపుల పెట్టిచూసుకుంటండు. నాకు నెలనెలా పింఛిని పంపుతండు. సారు, మీరూ సల్లంగుండాలె' అంటూ సారంగాపూర్ మండలం కోనాపూర్‌కు చెందిన బుచ్చవ్వ దీవించింది. బుధవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గ్రామానికి వెళ్లగా, అక్కడ ఈ వృద్ధురాలు ఇలా ఆత్మీయంగా ముచ్చటించింది. అనంతరం ఎమ్మెల్యే ఆ అవ్వతో 'మీరు మంచిగుండాలే.. మీ దీవెనలు ఇలాగే మాపై ఉండాలి' అని అన్నారు.

**- సారంగాపూర్, జూలై 19**

## ఎస్సారెస్పీలో పడ్డ దుప్పి

పెద్దపల్లి రూరల్, జూలై 19: అడవిలో ఉండాల్సిన ఓ దుప్పి బుధవారం పెద్దపల్లి మండలం రంగాపూర్ శివారు ప్రాంతంలోకి వచ్చింది. దానిని కుక్కలు వెంబడించడంతో తప్పించుకునే క్రమంలో ఎస్సారెస్పీ కాలువలో పడింది. బయటికి వెళ్లలేక అక్కడే ఉండిపోయింది. దానిని గమనించిన స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పెద్దపల్లి రేంజ్ అధికారి నాగయ్య పర్యవేక్షణలో సెక్షన్ ఆఫీసర్ మంగీలాల్, వాచర్లు సురేందర్, రాజు అక్కడికి చేరుకున్నారు. గ్రామస్తుల సహకారంతో ఆ దుప్పిని కాలువ నుంచి బయటకు తీసి చికిత్స కోసం పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని వెటర్నరీ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స అనంతరం దుప్పిని గురువారం కరీంనగర్‌లోని డీర్ పార్కుకు తరలిస్తామని చెప్పారు. ఇక్కడ సామాజిక కార్యకర్త పెద్దపల్లి డీఎంఆర్ యువసేన నాయకుడు సముద్రాల రాజ్‌కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



దుప్పిని బయటకు తీస్తున్న గ్రామస్తులు, అధికారులు

# బీఆర్‌ఎస్‌లోకి మాజీ ఎంపీటీసీ

- మధునయ్య వెంటే చేరిన లారీ ట్యాంకర్స్ అసోసియేషన్ నాయకులు
- గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కోరుకంటి



బీఆర్‌ఎస్‌లో చేరిన జయ్యారం మాజీ ఎంపీటీసీ ఎర్రంమధునయ్య

పాలకుర్తి, జూలై 19: పాలకుర్తి మండలం జయ్యారం మాజీ ఎంపీటీసీ ఎర్రం మధునయ్య బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. అలాగే ఈ సాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన లారీ ట్యాంకర్ అసోసియేషన్ నాయకులు నెరువట్ల అశోక్, యువకుడు కాసర్ల వెంకటేశ్ కూడా పార్టీలో చేరారు. గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుకంటి చందర్ వీరికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. మధునయ్య స్వతంత్ర ఎంపీటీసీగా గెలిచి, గతంలో పలు పార్టీలో పనిచేశారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పాలనకు ఆకర్షితుడై బీఆర్‌ఎస్ పార్టీలో చేరానని ఆయన చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాబోయే ఎన్నికల్లో తిరిగి గులాబీ జెండా రెపరెపలాడడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.